## క్లుప్తంగా

### ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు



పనులు చేపడుతున్న దృశ్యం

సారవకోట: మండలంలోని వడ్డినవలస నుంచి జలుమూరు మండలం కొమనాపల్లి వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. రూ 30 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నారు. రోడ్డు విస్తరణతోపాటు కొత్తగా కొన్నిచోట్ల కల్వర్టులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం వడ్డినవలస నుంచి చీడిపూడి మధ్యలో పనులు జరుగుతున్నాయి.

### ఉపాధి పనుల పరిశీలన



సుందరాడలో పనులు పరిశీలిస్తున్న చంద్ర కుమారి

మెళియాపుట్టి: కొలతల మేరకు పనులు చేయాలని ఉపాధి వేతనదారులకు ఎంపీడీవో చంద్రకుమారి సూచించారు. సుందరాడ, సిరియాఖండి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం పరిశీలించారు. నిబంధనల మేరకు రెండుపూటలా పనులు చేయడం ద్వారా గరిష్ట వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు. పని కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఎంతమంది పనిలోకి హాజరయ్యారు, ఇప్పటివరకు ఎన్ని పనిదినాలు పూర్తిచేశారని క్షేత్ర సహాయకులను అడిగి తెలుసుకున్నారు. వేతనదారుల సంఖ్య పెంచాలన్నారు. ఈసీ ఆదినారాయణ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బిజయ్ పండి ఉన్నారు.

### ఉపాధ్యాయ సంఘ కన్వీనర్‌గా వెంకటరమణమూర్తి



వెంకటరమణ మూర్తి

పాతపట్నం: ఎంటీఎస్ ఉపాధ్యాయ యూనియన్ (1998 డీఎస్సీ బ్యాచ్) మండల కన్వీనర్‌గా పాతపట్నం మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న కల్ల వెంకటమణ మూర్తి ఎన్నికయ్యారు. విషయాన్ని ఆయన బుధవారం తెలిపారు. ఈయనను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.


### రైతులకు ఎరువుల పంపిణీ



ఎరువులను అందజేస్తున్న దృశ్యం

బూర్జ: మండల కేంద్రం బూర్జలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఎరువులను బుధవారం పంపిణీ చేశారు. రానున్న ఖరీఫ్ సీజన్ కోసం సమకూర్చిన ఎరువులను జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ ఏగు అనురాధ ద్వారా చెరుకు రైతులకు సబ్సిడీపై ద్రవరూపంలో నానోయూరియా, డీఏపీ అందజేశారు. మండల వ్యవసాయ అధికారి వి.రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రస్తుతం 80 శాతం ఎరువులు ఆర్‌బీకేల ద్వారా, 20 శాతం ప్రైవేటు డీలర్లు, సొసైటీల ద్వారా అందించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ సహాయకులు కె.వసంత పాల్గొన్నారు.

### నీలమణిదుర్గ ఉత్సవాలకు ఏర్పాట్లు



అమ్మవారి ఆలయం వద్ద అలంకరణ ఏర్పాట్లు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం కూడలిలో విద్యుత్ అలంకరణ కోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి గుడి నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా, ప్రధాన రహదారి కూడలిలో విద్యుత్ వెలుగులను ఏర్పాటు చేయనున్నారు.

### పొందూరు ఎంపీడీవోకు సతీవియోగం

పొందూరు: పొందూరు ఎంపీడీవో సీపాన హరిహరరావు సతీమణి పద్మావతి మంగళవారం అర్ధరాత్రి హైదరాబాద్‌లో మరణించారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. మృతదేహాన్ని స్వగ్రామం తోలాపి గ్రామానికి తీసుకొచ్చి బుధవారం అంత్యక్రియలు పూర్తి చేశారు. ఆమె మృతిపై ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పప్పల రాధాకృష్ణ ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

# ముంచెత్తిన వాన



పాతపట్నంలో కురుస్తున్న వర్షం



ఆమదాలవలస: మున్సిపల్ కాంప్లెక్స్ ఆవరణలోకి చేరిన వరద



ఆమదాలవలస: రైల్వేస్టేషన్ ఆవరణలో చేరిన వర్షపునీరు

● లోతట్టు ప్రాంతాలు జలమయం

పాతపట్నం: పాతపట్నం పరిసర గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అచ్చుతపురం, ప్రహరాజపాలెం, కొదూరు, గోపాలపురం, బూరగాం, గంగువాడ, కొరసవాడ తదితర గ్రామాల్లో కురిసిన వర్షంతో కొత కోచి ఎండలో ఆరబెట్టిన నువ్వు చేను, మొక్కజొన్న కండెలు తడిచిపోయాయి. వీటిని కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడ్డారు.

**ఆమదాలవలస పట్టణంలో..**

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలో సుమారు 40 నిమిషాలు పాటు భారీగా కురిసిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. అకాల వర్షంతో చిరువ్యాపారులు, పండ్ల దుకాణదారులు ఇక్కట్లు పడ్డారు. రైల్వేస్టేషన్, బస్టాండ్ నుంచి ప్రయాణికుల రాకపోకలకు కాసేపు ఇబ్బంది కలిగింది. మున్సిపల్ కాంప్లెక్స్, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, రైల్వేస్టేషన్ ఆవరణ వర్షం నీటితో నిండిపోయింది.

ఆమదాలవలస రూరల్: అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కొత్తవలస, నిమ్మతొర్లాడ, దూసి, తోటాడ, అక్కివరం, వంజంగి తదితర గ్రామాల్లో ఇటుక బట్టీల్లోకి వర్షపునీరు చేరింది. నువ్వు పంటకు నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆమదాలవలస రూరల్: కురుస్తున్న వర్షం



ఆమదాలవలస రూరల్: జొన్నవలసలో నువ్వు పంటపై కప్పిన పరదాలు



ఆమదాలవలస రూరల్: దూసిలో ఇటుకలపై పరదాలు కప్పిన దృశ్యం

## ముగిసిన గ్రామ దేవత పండుగలు



తిరుగుముఖం పడుతున్న భక్తులు



నరసన్నపేట: జనంతో రద్దీగా ఉన్న జమ్ములోని ప్రధానవీధి

సారవకోట: కిన్నెరవాడ గ్రామంలో గత నెల 30వ నుంచి జరుగుతున్న సిరిమాను పండుగలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజున చెవిటమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు చేసి మొక్కులు చెల్లించారు. పండుగ కోసం బంధువుల ఇళ్లక వచ్చి తిరుగుముఖం పట్టిన వారితో వడ్డినవలస నుంచి కిన్నెరవాడ, బుడితి నుంచి కిన్నెరవాడ వెళ్లే రోడ్లు జనంతో రద్దీగా మారాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

**జమ్ములో అశిరితల్లి అమ్మవారి పండుగ..**

నరసన్నపేట: జమ్ము గ్రామంలో అశిరితల్లి గ్రామ దేవత అమ్మవారి మహోత్సవాలు వైభవంగా ముగిశాయి. 20 ఏళ్ల తరువాత ఉత్సవాలను గ్రామ కమిటీ వైభవంగా నిర్వహించింది. పండుగ కోసం బంధువుల ఇళ్లకు వచ్చిన వారితో జమ్ము గ్రామం కిటకిట లాడింది. జాతీయ రహదారి (326ఏ)పై కొద్ది సమయం వాహనాలు స్తంభించాయి. పోలీసులు స్పందించి వాహనాలను క్రమబద్ధీకరించారు. గ్రామంలో మాకివలస పీహెచ్‌సీ సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు.



నరసన్నపేట: వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

కొత్తూరు: కుంటిభద్ర గ్రామదేవత చెవిటమ్మ తల్లి పండుగలు ముగిశాయి. ఐదురోజులు వైభవంగా పండుగలు జరిగాయి. చివరి రోజున జరిగిన విందు కార్యక్రమానికి బంధువుల ఇళ్లకు వచ్చిన వారితో గ్రామం కిటకిటలాడింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఎస్ఐ ఎం.గోవింద పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



కొత్తూరు: జనంతో రద్దీగా ఉన్న కుంటిభద్రలోని ఓ వీధి

### వెండి ఆభరణాలు బహూకరణ



ఆభరణాల అలంకరణలో సీతారాముల విగ్రహాలు

పొందూరు: వీఆర్ గూడెం గ్రామంలోని రామాలయంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలకు రూ. 3 లక్షలు విలువైన వెండి కిరీటాలు, కవచాలను అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ తల్లిదండ్రులు ఆనందరావు, పద్మావతిలు బుధవారం సమర్పించారు. సువ్వారి క్రిష్ణవేణి జ్ఞాపకార్థం వీటిని అందించామన్నారు.

### గొటివాడలో సత్యనారాయణ స్వామికి పూజలు



పూజలు చేస్తున్న అర్చకులు

జలుమూరు: గోటివాడ గ్రామంలో సత్యనారాయణస్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన బుధవారం స్థిర ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. అర్చకులు వివిధ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి

ఆమదాలవలస: పెన్షన్ పొందుతున్న రిటైర్డు ఉద్యోగులంతా ఈనెల ఆరో తేదీలోగా ఈకేవైసీని తప్పనిసరిగా పూర్తి చేయించుకోవాలని ఆమదాలవలస సబ్‌ట్రెజరీ అధికారి ఎస్.సువర్ణరాజు సూచించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆమదాలవలస సబ్‌ట్రెజరీ పరిధిలో 1130 మంది పెన్షనర్లకు 440 మంది మాత్రమే ఈకెవైసీ చేయించుకున్నారన్నారు. మిగిలినవారంతా త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, పీపీఓ ఆర్డర్ కాపీ, సీఎఫ్ఎంఎస్ నంబర్, మొబైల్ తీసుకొని ఎస్‌టీవో కార్యాలయం లేదా అందుబాటులో ఉన్న నెట్ సెంటర్లో ఈకేవైసీ చేయించుకోవాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.సిమ్మినాయుడు, బి.మోహన్‌రావు కూడా తెలియజేశారు. హెచ్‌ఈఆర్‌బీ యాప్ ద్వారా కూడా ఈకేవైసీ చేయించుకోవచ్చునన్నారు.

### అయ్యప్ప స్వామికి పూజలు



అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాత శ్రీకాకుళం ధర్మశాస్తా ఆలయంలో వేంచేసిన అయ్యప్పస్వామికి బుధవారం క్షీరాభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. అనంతరం స్వామిని అలంకరించారు.

## ఇంటర్న్‌షిప్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

ఎచ్చెర్ల క్యాంపస్:

ఉన్నత విద్యలో ఇంటర్న్‌షిప్ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని శ్రీకాకుళానికి చెందిన మోనిన్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ పార్టనర్ శ్రీధర్ అన్నారు. ఎచ్చెర్లలో ని వెంకటేశ్వరా కళాశాలల్లో ఇంటర్న్‌షిప్ ప్రాధాన్యంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖ పీజీ కోర్సుల్లో ఇంటర్న్‌షిప్ తప్పని సరిచేస్తోందన్నారు. విద్యార్థులు పరిశ్రమల్లో నిబంధనల మేరకు 90 రోజుల దాటి పనిచేయటం వల్ల పరిశ్రమల నిర్వహణపై అవగాహన వస్తుందన్నారు. ఎంబీఏ విద్యార్థులు యువమేనేజర్లుగా, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా విజయవంతంగా ముందుకు సాగాలంటే క్షేత్రస్థాయి అవగాహన, విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్ అవసరమన్నారు. ప్రతి విద్యార్థి ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా కోర్సుల్లో చేరాలని, చేరిన నుంచి పూర్తిస్థాయి విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ జి.గోవిందరాజులు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌సీవీ రమణమూర్తినాయుడు, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.సత్యం తదితరులు పాల్గొన్నారు.

## డీడీ జయరాజ్‌కు సన్మానం



డీడీ జయరాజ్‌ను సన్మానిస్తున్న ఏడీ లోకనాథం తదితరులు

కోటబొమ్మాళి: టెక్కలి పశుసంవర్ధక శాఖ అందించిన సేవలకు గానూ రాష్ట్రస్థాయిలో ఇటీవల ప్రథమ బహుమతి లభించిన విషయం తెలిసిందే. దీంతో స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో డీడీ జయరాజ్‌ను ఏడీ ఎం.లోకనాథం, సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పెడ్రిక్, కోట ధర్మారావు, ఎస్.శాంతారావు, వి.భానోజీరావు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వేతో రైతులకు మేలు

పలాస: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని బొడ్డపాడు పంచాయతీ సర్పంచ్ తామాడ మదన్, ఎంపీటీసీ మద్దిల పాపారావులు అన్నారు. బొడ్డపాడు రెవెన్యూ పరిధిలోని భూముల సర్వేకు సంబంధించి డ్రోన్ కెమెరాను బుధవారం ప్రారంభించారు. సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మీనాకుమారి, వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు బుడత ధనరాజు, పత్తిరి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ● సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి విజయనగరం జిల్లా భోగాపురం హెలిప్యాడ్ వద్ద బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు మంచి నీటిని సరఫరా చేసేందుకు రూ.265 కోట్లు మంజూరు చేసినందుకు సీఎంకు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

- ఎల్.ఎన్.పేట

## క్షేత్ర సహాయకుల నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ సావిత్రి

కొత్తూరు: కొత్తూరు మండలంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులను అధికారులు నియమించారు. వీరికి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సవర సావిత్రి నియామక పత్రాలను అందజేశారు. ఇరపాడుగూడ పంచాయితీకి సవర నాగరాజు, కర్లెమ్మ ఆర్‌ఆర్ కాలనీకి గుల్లపాటి మిన్నారావు, బిట్-2 ఆర్‌ఆర్ కాలనీకి బర్రి రేవతి, కాకరగూడకు అనీల్‌కుమార్, మరికొంత మంది నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. జాబ్‌కార్డు ఉన్న వేతనదారులందరికీ పనులు కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితుడు అంపిలి ప్రశాంత్‌కుమార్, నాయకులు సవర రమేష్, పడాల వెంకటకృష్ణ, సర్పంచ్‌లు అడపాక శంకరరావు, అప్పారావు, ఫాల్గుణరావు, కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు పి.సింహాచలం, పీఎంసీ చైర్మన్ వడమ శ్రీనివాసరావు ఉన్నారు.

## నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మెళియాపుట్టి, కొత్తూరు మండలాల్లోని మూడు పంచాయతీలకు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించారు. వీరికి పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో శాసనసభ్యురాలు రెడ్డి శాంతి వీరికి నియామక పత్రాలను అందజేస్తున్నారు. మెళియాపుట్టి మండలం కొత్తూరుకు బెజ్జి బాలకృష్ణ, సవర కొలిగాం పంచాయతీకి సవర ప్రసన్నకుమారి, కొత్తూరు మండలం గుణభద్ర ఆర్.ఆర్.కాలనీకి పెద్దకోట ప్రసాదరావు ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియామకమయ్యారు. కార్యక్రమంలో మెళియాపుట్టి ఏపీవో తెంబూరు రవి, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమానికి కృషి

● ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షుడు రమణ



మాట్లాడుతున్న ఎఫ్ఎస్‌సీఎస్ అధ్యక్షులు రమణ

రణస్థలం: రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని రణస్థలం రైతు సేవా సహకార సంఘం (ఎఫ్ఎస్‌సీఎస్) అధ్యక్షుడుగా నియమితులైన కిల్లారి రమణ అన్నారు. మండల కేంద్రంలోని ఎఫ్ఎస్‌సీఎస్ కార్యాలయ అవరణలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ ఆశీస్సులతో, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ చొరవతో అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో అధ్యక్షులుగా పని చేసిన వారి సూచనలు, సలహాలతో సొసైటీ బ్యాంకును ముందుకు నడిపిస్తానన్నారు. ప్రభుత్వ పరంగా సక్రమించే ప్రతీ రుణ సదుపాయాన్ని రైతులందరికీ అందేలా చూస్తానని చెప్పారు. తొలుత రణస్థలం జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం మాట్లాడుతూ.. బ్యాంక్ అభివృద్ధిలో భాగంగా కల్యాణ మండపం నిర్మిస్తే రణస్థలం, లావేరు మండల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సొసైటీ బ్యాంకుకు అద్దె రూపంలో ఆదాయం లభిస్తోందని చెప్పారు. అందుకు వచ్చే కమిటీ సమావేశంలో తీర్మానం చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని సొసైటీ సభ్యులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ ఎండీ సీహెచ్ మార్కొండెయ స్వామి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పైడి శ్రీనివాసరావు, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ అధ్యక్షుడు బొంతు సూర్యనారాయణ, కరిమజ్జి భాస్కరరావు, పైడిభీమవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గొర్లె తిరుపతి నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరా మినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, గొర్లె అప్పలనర్సు నాయుడు, మహంతి చిన రామినాయుడు, దేశెట్టి తిరుపతిరావు, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు గురాన మానస, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు ఉన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి కృషి



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సరోజనమ్మ, సర్పంచ్ సుజాత తదితరులు

టెక్కలి: పాఠశాలల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ అన్నారు. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి ఆంజనేయపురం గ్రామ ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గది నిర్మాణానికి సర్పంచ్ గొండేల సుజాత ఆధ్వర్యంలో బుధవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎం.కిషోర్, మండల ప్రత్యేకాహ్వానితుడు ఎన్.శంకర్, వార్డు సభ్యుడు తోట లోకేశ్వరరావు, నాయకులు బి.ధనుంజయ్, ఎ.రాహుల్, గ్రామస్తులు ఆదినారాయణ, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక నృత్యాల ప్రదర్శన

ఇచ్ఛాపురం: గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. బుధవారం స్వేచ్ఛా నృత్య తరంగిణి డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ సంస్కృతీ సాంప్రదాయల మిళితమైన భరతనాట్యం, కూచిపూడి నాట్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.